క్లుప్తంగా

నేడు సోమప్ప జాతరపై సమీక్షా సమావేశం

నేరేడుచర్ల : మండలంలోని బురుగులతండాలో గల సోమప్ప దేవాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి 21 వరకు జరిగే సోమప్ప జాతరపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ వెంకారెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖలలోని మండల స్థాయి అధికారులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పాలకవీడు : మండల పరిధిలోని మహంకాళి గూడెం గ్రామం (డెక్కన్ పరిశ్రమ కాలనీ)లో డెక్కన్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో మిర్యాలగూడెం బాలాజీ హాస్పిటల్ వైద్యులచే బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో సంతాన సమస్యలు, ఎముకలు, దంత సంబంధిత, సాధారణ వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట సీజీఎం నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విరాళం అందజేస్తున్న దాత

నడిగూడెం : ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని శ్రీ షిర్డీ సాయి మందిరం ట్రస్టు అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిర ఆవరణలో నిర్మించనున్న భోజనశాల నిర్మాణానికి నడిగూడెంకు చెందిన కొరట్ల తిరపయ్య– సువర్ణ దంపతులు సోమవారం రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారుడు పసుపులేటి భిక్షం తదితరులున్నారు

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



గ్రీవెన్స్ డేలో పాల్గొన్న అధికారులు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే)ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శాంతకుమారి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఆమె మాట్లాడారు. ఎంపీఓ మౌలానా, ఏపీ ఓ శైలజ, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



పాడి రైతులకు మందులు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన

హుజూర్‌నగర్ : పశువులకు సోకే ముద్ద చర్మ వ్యాధికి ప్రభుత్వ పశువైద్యశాలలో ఉచిత చికిత్స అందిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ముద్ద చర్మ వ్యాధి రాకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కాగా ఈ శిబిరంలో వైద్యులు పశువులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, పశువైద్యులు రూప్‌కుమార్, మమత, శ్రీనివాస్‌రెడ్డి, కేఎల్‌ఎస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదకు నివారణ చర్యలు



యాతవాకిళ్లలో బోనులో చిక్కిన వానరాలు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో గత కొద్ది రోజులుగా కోతులు (వానరాలు) గుంపులుగా చేరి పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. దీంతో సోమవారం స్థానిక సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు కోతులు పట్టే వారిని పిలిపించి బోను సహాయంతో సుమారు 100కు పైగా కోతులను పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోకి కోతులు విపరీతంగా చేరి ఇళ్లలో చొరబడడం, పంట పొలాలను నాశనం చేస్తున్నాయని గ్రామస్తులు మొర పెట్టుకోవడంతో వాటిని పట్టించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

చి‘వరి’కి సాగు నీరేదీ..

- మేజర్ కాల్వలకు పేర్లు పెట్టిన గ్రామాలకే సాగునీరు నిల్
- మరోవక్క విద్యుత్ సమస్య
- సతమతమవుతున్న రైతులు



మంగళితండా వద్ద చుక్క నీరు లేని కొత్తగూడెం మేజర్ కాల్వ

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని పలు గ్రామాలకు నాగార్జునసాగర్ సాగు నీరందడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు నాన్‌ఆయకట్టు పద్ధతిలోనే మోటార్లతో వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాల పేర్లు మేజర్ కాల్వలకు పెట్టారని, కానీ పేర్లు కలిగిన గ్రామాలకే చుక్క నీరందడం లేదని అంటున్నారు.

మూడు మేజర్ కాల్వలకు..

మండలంలోని సాగర్ ప్రధాన కాలువ నుంచి కొత్తగూడెం మేజర్, ముక్త్యాల బ్రాంచ్ కాలువ నుంచి రెడ్లకుంట మేజర్, గణపవరం మేజర్ కాల్వలు ఉన్నాయి. ఈ కాల్వల ద్వారా చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. విచిత్రం ఏంటంటే ఆయా గ్రామాల పేర్లతో ఉన్న కాల్వల పరిధిలోని గ్రామాల పంట భూములకు సరిపడా నీరు అందడం లేదు. దీంతో రైతులు మా ఊరి పేరుతో కాల్వలు ఉంటాయి కానీ తమ భూములకు మాత్రం నీరు అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాథావిధిగా కంపచెట్లు..

కాగా, నాలుగేళ్ల కిందట సాగర్ కాలువ ఆధునీకీకరణ పనుల్లో భాగంగా మూడు మేజర్ కాల్వల పనులు చేపట్టి చెత్త, కంప చెట్లతో ఉన్న కాల్వలను శుభ్రం చేశారు. దీంతో కింది భూములకు నీరు వేగంగా చేరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ పనులు చేసినా చివరి భూములకు నీరు అందడం లేదు. దీంతో కాల్వలు యథావిధిగా కంప చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీనికి తోడు కాల్వలపై అనేక చోట్ల అనధికారిక తూములు, కొన్ని తూములకు తలుపులు లేకపోవడంతో కూడా నీరు పైనే వృథాగా పోతుంది. దీంతో కింది పొలాలకు నీరు చేరడం లేదు.

చివరి భూములకు నీరందించాలి



కొత్తగూడెం మేజర్ కాలువ చివరి గ్రామాలైన చిమిర్యాల, కొత్తగూడెం, మంగళితండా గ్రామాలకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అనేకసార్లు ఎన్నెస్పీ అధికారులకు కోరినా వారు ఏమాత్రం కనికరించడం లేదు. పేరుకే మేము ఆయకట్టు రైతులం కానీ నాన్‌ఆయకట్టు పద్ధతిలోనే మోటార్లతో వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి భూములకు నీరందించాలి.

– ధరావత్ బాబ్జీ, మంగళితండా

వినతిపత్రాలు అందజేసినా..

ప్రధానంగా కొత్తగూడెం మేజర్ కాల్వ పరిధిలోని చిమిర్యాల, కొత్తగూడెం, మంగళితండా చివరి భూములకు చుక్క నీరు కూడా రావడం లేదని రైతులు అంటున్నారు. ఆర్‌కె మేజర్, గణపవరం మేజర్‌లకు మాత్రం వారబంధి పద్ధతిలో నెలకు వారం పదిరోజులు మాత్రమే నీరు వస్తుంది. దీంతో చివరి భూములకు నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విద్యుత్ కోత ఎక్కువ కావడంతో బోర్లు, బావుల నీటితో సాగు చేస్తున్నా వరి సాగు ఎండిపోతుందని, కెనాల్స్‌లో నీరు వస్తే విద్యుత్ సమస్యలను అధిగమించవచ్చని రైతులు అంటున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



మఠంపల్లి : గుండ్లపల్లిలో ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

మఠంపల్లి : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండలంలో తన స్వగ్రామమైన గుండ్లపల్లిలో నిర్మాణంలో ఉన్న శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం, గణపతి ఆలయం, శివాలయం, దుర్గాలయంతో పాటు నవగ్రహ ఆలయ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పనులు చేస్తున్న శిల్పులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, నవీన్‌నాయక్, నాగేశ్వరరావునాయక్, భరత్‌నాయక్, కె. శ్రీను, ఇమ్మానియేల్ తదితరులున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

హుజూర్‌నగర్ : నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మేళ్లచెరువు మండలం కందిబండకు చెందిన పలువురు సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రుక్కయ్య, కె.వెంకటేశ్వర్లు, పేరారెడ్డి, తోడేటి కనకయ్య, తోడేటి సింహాద్రి, దేవరపల్లి భద్రారెడ్డి, కట్ల వెంకటేశ్వర్లు, రాజు, వీరయ్య, తదితరు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



నర్సింహులగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల : సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని గ్రామాలకు మహర్దశ పట్టిందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని నర్సింహులగూడెంలో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామీణ రహదారులకు మోక్షం లభించిందన్నారు. కోదాడ నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ అండదండలతో అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోయేందుకు తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పిడమర్తి సుక్కమ్మ అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేలు, షేక్ లాల్‌బీకి రూ.24వేల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎస్.అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, సర్పంచ్ కొప్పు ప్రమీల, ఎంపీటీసీ మదార్‌బీ, గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, బీఆర్‌ఎస్ నాయకులు నాగు శంకర్, లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, మధుసూధన్, కోటేష్, షేక్ పాషా, వార్డు సభ్యురాలు భవాని పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ నమ్మక ద్రోహం



కొమరబండ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం నమ్మక ద్రోహం చేస్తుందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ అన్నారు. పార్లమెంటు సమావేశాల్లో ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తుందన్నారు. రహదారిపై ధర్నాతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని ధర్నా చేస్తున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనాలను పంపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి రాజుమాదిగ, అనీల్‌కుమార్ మాదిగ, శాగంటి రమేష్ మాదిగ, వడ్డెపల్లి రామకృష్ణ, వెంకట్రావు, కుడుముల శ్రీను, సత్యరాజు, సురేష్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనం చెల్లించడం, సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం చింతలపాలెం మండలంలోని దొండపాడులో సిమెంట్ కార్మికులపై సర్వే నిర్వహించి అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న 13 సిమెంట్ పరిశ్రమలలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వట్టెపు సైదులు, కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు, ప్రకాష్, కాంతారావు, సీతారాంరెడ్డి, అజముద్దీన్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం పరిధిలో కార్మికుల సమస్యలపై సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శీలం శ్రీను, వట్టెపు సైదులు, నాగేశ్వరరావు, ప్రకాశ్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

తిరోగమన పద్ధతిలో మోదీ పాలన



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : దేశంలో ప్రధాని మోదీ పరిపాలన తిరోగమన పద్ధతిలో కొనసాగుతోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ మండల కన్వీనర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాతో కార్మిక వర్గం ఉపాధి కోల్పోయి ఆకలి చావులతో బలై పోతుంటే కార్పొరేట్ల ఆదాయం మాత్రం మోదీ నిర్ణయాలతో లక్షల కోట్లకు పెరిగిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మిక, కర్షక వర్గంతో పార్లమెంటు ముందు చేపట్టబోయే మహా ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, నాయకులు రాధకృష్ణ, వట్టెపు సైదులు, వరలక్ష్మి, ఎం.శ్రీను, రామ్మూర్తి, రన్‌మియా, వెంకన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి



గరిడేపల్లి : మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి

గరిడేపల్లి : కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి తెలిపారు.ప్రజా గోస -బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రెగులగడ్డతండా, తాళ్ల మల్కాపురం గ్రామాల్లో బీజేపీ శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యుల కోసం ప్రవేశపెట్టిన ఈ- శ్రమ్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు. అదేవిధంగా రైతులకు ఫసల్ బీమా పథకం, ఎరువుల సబ్సిడీ, ఉజ్వల గ్యాస్, జీవన్ జ్యోతి పథకాల గురించి తెలియజేశారు. కేంద్ర నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, వైకుంఠ ధామాలు, పల్లెప్రకృతి వనాలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ శక్తి కేంద్రాల కోఆర్డినేట్ కన్వీనర్ అంబళ్ల నరేష్, కోఆర్డినేట్ సహ కన్వీనర్ గుండెబోయిన వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కీతవారిగూడెంలో..

మండలంలోని కీతావారిగూడెంతో శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి చలిగంటి ప్రమీల, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, నాయకులు గంధం సతీష్, ఆర్ కృష్ణయ్య, సీహెచ్.సోమయ్య, ఎం.వెంకటేశ్వర్లు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కేసీఆర్‌ది అవినీతి పాలన

కోదాడఅర్బన్ : కేసీఆర్ కుటుంబ అవినీతి పాలనతో తెలంగాణ ప్రజలు గోస పడుతున్నారని, వారికి భరోసా ఇచ్చేందుకే బీజేపీ ప్రజా గోస- బీజేపీ భరోసా యాత్రను చేపట్టిందని బీజేపీ జిల్లా కార్యదర్శి తోట శేషు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని 203, 204, 205, 209 బూత్‌లలో శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మాటల గారడీతో ప్రజలను మోసం చేస్తున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సాతులూరి హనుమంతరావు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ ఏపూరి గణేష్, బూత్ కమిటీ అధ్యక్షుడు ములుగు హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు, కొండ్లె రవికుమార్, నరేష్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం నిర్వహించాలి

నేరేడుచర్ల : కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలని శక్తి కేంద్రాల హుజూర్‌నగర్ కోఆర్డినేట్ కన్వీనర్ నరేష్‌గౌడ్ అన్నారు. సోమవారం నేరేడుచర్లలో నిర్వహించిన శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు, వీరబాబు, మండల అధ్యక్షుడు పార్థనబోయిన విజయ్‌కుమార్, పల్లెపంగ వీరబాబు, వెంకన్న, సతీష్, పవన్, ప్రవీణ్, అంజనేయులు తదితరులున్నారు.

‘ప్రజా గోస – బీజేపీ భరోసా’

హుజూర్‌నగర్ : ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బీజేపీ శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ శక్తి కేంద్రాల అసెంబ్లీ కోఆర్డినేట్ కన్వీనర్ అంబళ్ల నరేష్, కోఆర్డినేట్ సహ కన్వీనర్ వీరబాబు, పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి, నాగరాజు, గోపి, ఉపేందర్, సతీష్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐల ఎదుట సీపీఐ నాయకుల ధర్నా



హుజూర్‌నగర్‌లో ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



కోదాడలో ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : కార్పొరేట్ వ్యాపారుల అవినీతి అక్రమాలను నిరోధించేలా కేంద్రం వ్యవహరించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సంపదను కార్పొరేట్ సంపన్నులు దొంగల మాదిరి దోచుకుంటున్నారని ఆరోపించారు. వ్యాపార వేత్త అదానీ వ్యవహారం బయట పడేసరికి జాతీయత పేరు చెప్పి కేంద్రం కొత్త నాటకానికి తెర లేపిందని విమర్శించారు. అదానీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఆర్థిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని, అతని ఆస్తులను జాతీయం చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు, జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, నాయకులు గుండు వెంకటేశ్వర్లు, కేవీఎస్ మూర్తి, జడ శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, యల్లావుల రమేష్, దొంతగాని సత్యనారాయణ, జక్కుల రమేష్, సుందరి పద్మ, జడ వెంకన్న, సైదులు, స్టాలిన్, స్వామి, మోహన్ రావు, లక్ష్మయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఆస్తులు జప్తు చేయాలి

కోదాడఅర్బన్ : పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రధాన బ్రాంచ్ ఎదుట సోమవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన మాట్లాడుతూ దేశ సంపదను అదానీ సంస్థకు అప్పగించి ప్రభుత్వ రంగ సంస్థలను దివాళా తీయించే విధంగా మోదీ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ల నుంచి అక్రమ మార్గంలో వేల కోట్లు దారి మళ్లించారని విమర్శించారు. తక్షణమే అదానీ ఆస్తులను వేలం వేసి నష్టపోయిన ఎల్‌ఐసీకి జమచేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శులు మండల వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, ఎస్కే లతీఫ్, నాయకులు రాజు, సాయి బెల్లి, జానీ, రాజు, శ్రీనివాస్, ఘనీ పాల్గొన్నారు.


మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేయాలి

నేరేడుచర్ల : అదానీపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైయివేటు పరం చేస్తుందున అతనిపై మనీ ల్యాండరీంగ్ కేసు నమోదు చేసి జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ సీపీఐ కార్యదర్శులు ఎల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రావుల సత్యం, లక్ష్మి, చిలకరాజు శ్రీను, భిక్షం, శ్రీరాములు, నాగేశ్వర్‌రావు, ఉపేందర్, నాగయ్య, వసంతరావు, సైదులు, బాలరాజు తదితరులున్నారు.


జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలి

గరిడేపల్లి : అదానీ కంపెనీలలో పెట్టుబడులపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు సోమవారం గరిడేపల్లిలోని బ్యాంకు ముందు నిరసన తెలిపి బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, నాయకులు నబీ, తిరపయ్య, మహేష్, నాగేశ్వరరావు, బొందయ్య, శేషయ్య, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలి



హుజూర్‌నగర్‌రూరల్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్



నడిగూడెం : కాగితరామచంద్రాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోదాడరూరల్ : 18 సంవత్సరాల వయస్సు పైబడిన ప్రతిఒక్కరూ తప్పకుండా కంటి పరీక్ష చేయించుకోవాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గణపవరంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారీశేషు, సర్పంచ్ పొట్టా శ్రీవిజయకిరణ్, ఆలయ కమిటీ చైర్మన్ కామిశెట్టి నరసింహరావు, వెంకట్‌రెడ్డి, రమేష్‌బాబు, పూర్ణయ్య, మట్టపల్లి, రాంరెడ్డి, రామారావు తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని బూరుగడ్డలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ షేక్ సలీమారంజాన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో వార్డుల వారీగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలాన, ఉప సర్పంచ్ శీలం ఆదెమ్మ, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు షేక్ అలీపాషా, సుందరయ్య, కార్యదర్శి ఉపేందర్, నాగలింగం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన అన్నారు. సోమవారం పట్టణంలోని గోవిందపురంలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ శిబిరం పరిశీలన

నడిగూడెం : కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ యం.యర్రయ్య కోరారు. సోమవారం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కౌసల్య మృతి బాధాకరం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ కమతం వెంకటయ్య తల్లి కౌసల్య సోమవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆమె మృతి బాధాకరమని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, బీఆర్‌ఎస్ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, కౌన్సిలర్లు బత్తినేని హనుమంతరావు, సామినేని నరేష్, వీరంరెడ్డి లింగారెడ్డి, పలు పార్టీల నాయకులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్ : రైస్ మిల్లు కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రైస్ మిల్లు కార్మికుల గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. రైస్ మిల్ డ్రైవర్స్, కార్మికులు, యాజమాన్యం జాయింట్ చర్చలు వాయిదా పడటంతో కార్మికులు పోరుబాట పట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా వారికి వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు శీతల రోషపతి, బెల్లంకొండ గురవయ్య, కోటేశ్వరరావు, జానయ్య, సైదులు, పర్వతాలు, రాము, వీరబాబు, రామయ్య, మల్లయ్య, అంజి, లింగయ్య, తిరపయ్య, తదితరులు పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్ అందించాలని వినతి



కోదాడఅర్బన్ : విద్యుత్ ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కోదాడఅర్బన్ : రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కోదాడ విద్యుత్ ఏడీఈ వెంకన్నకు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచితంగా 24 గంటలు విద్యుత్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. విద్యుత్ కోతతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క కాలువలకు నీరు రాక, మరోపక్క విద్యుత్ లేక రైతులు సతమతమవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి ఎం.ముత్యాలు, జిల్లా కమిటీ సభ్యులు జుట్టుకొండ బసవయ్య, దేవరం వెంకటరెడ్డి, నాయకులు డాక్టర్ సూర్యనారాయణ, ఏనుగుల వీరాంజనేయులు, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

మఠంపల్లి : బోర్లు, బావుల నీటితో వరి సాగు చేపట్టిన రైతులకు 24 గంటల విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సాగుకు 10 గంటలు కూడా కరెంట్ సక్రమంగా ఇవ్వకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, పాదిల సైదులు, కంటు కోటయ్య, పొడిశెట్టి రాము, శివనాయక్, హరియానాయక్, శంభయ్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతతో అల్లాడుతున్న రైతులు

మోతె : కరెంట్ కోతలతో రైతులు అల్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మామిళ్లగూడెంలో సూర్యాపేట- ఖమ్మం జాతీయ రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో రోజురోజుకు కరెంట్ కోత అధికమవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెప్పుకుంటున్నా రోజుకు కనీసం 12 గంటలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు రోజూ పొలాల వద్దనే కరెంట్ కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి సొంత జిల్లాలోనే విద్యుత్ కోత విధించడం సిగ్గు చేటన్నారు. అనంతరం మామిళ్లగూడెం సబ్‌స్టేషన్ ముందు రైతులతో ధర్నా నిర్వహించి విద్యుత్ అధికారులకు రైతులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ మధుసుదన్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు బచ్చు అశోక్, పులి ఈదయ్య, నాగునాయక్, బాలకృష్ణ, గణేష్, కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.